

# ఎవరికోరకో ఆ నిరీక్షణో!

పుష్యమి

ఉదయం తొమ్మిదిగంటల సమయం.

ఆస్పత్రి ముందు కారు దిగుతూనే 'శారదా నర్సింగ్‌హోమ్' అనే అక్షరాలు చూచిన ఆనందు ముఖంలో యేదో ఆతృత కనిపిస్తోంది.

ఆ వూరికి కొత్తగా వచ్చిన కోర్టు మున్సిఫ్ రాజగోపాలరావు చెల్లెలు సుశీలకు భర్త ఆనంద్. ఆనందప్రసాద్

హైద్రాబాదులో ఫిజిక్స్ లెక్చరరు. సుశీలకు ఏడు సంవత్సరాల తర్వాత రెండవ కాన్పుకు అన్నగారి యింటికి వచ్చింది. ఆరోగ్యం పూర్తిగా దిగజారివున్న సుశీలను, డా॥ శారదాదేవి తెలివిగలది, హస్తవాసి మంచిది అని విని, శారదా నర్సింగ్ హోమ్‌లో చేర్చాడు, అన్న రాజు.

అయోమయస్థితిలో మూడురోజులు విపరీత బాధపడిన సుశీల ప్రసవమై నాల్గు రోజులైంది. మూడవ రోజుకు స్పృహ వచ్చింది. అందరితో తేలికగా మాట్లాడుతోంది. వారం రోజులుగా యేకధాటిని మృత్యువుతో హోరాహోరి పోరాడి, తన శక్తినంతా వినియోగించి, సుశీలను కాపాడి, తన ప్రజ్ఞను నిరూపించుకుంది డాక్టరు శారద.


ఆనందు భార్యను చూడటానికి ఆ ఉదయమే హైదరాబాదునుండి వచ్చాడు. బావమరదులిద్దరూ సుశీలను చూడటానికి వచ్చారు. ప్రసూతి భాగం వరండా ముందు నిలబడి, అటూ యిటు తిరిగే నర్సులను, బిల బిలా వచ్చే పేషెంట్సు బంధువులను, కొబ్బరిచెట్లకింద నల్లగా నిగనిగ లాడుతున్న డాక్టరు కారును చూస్తూవున్నారు. ఇంతలో బాలల ప్రత్యేక విభాగంనుండి వస్తున్న డాక్టరును చూచి ఎదురు వెళ్ళి, "గుడ్ మార్నింగ్, డాక్టర్," అన్నాడు రాజు.

"గుడ్‌మార్నింగ్," అంది. విస్మయానందాలతో అచేతనంగా నిల్చున్న ఆనందును పరిచయం చేశాడు రాజు. సుశీల ఆరోగ్యం గురించి మాట్లాడుతూ లోనికి నడుస్తున్న డాక్టరూ, రాజులను అనుసరించాడు ఆనంద్.

5 వ నెంబరు రూమ్‌లో కెళ్ళారు. "ఏమండీ ఎలా వున్నారు?" అని పలకరిస్తూ సుశీల బెడ్ దగ్గిర కెళ్ళింది డాక్టర్. రోగి పరిస్థితి వివరంగా చూచుకుని గ్లూకోజ్ ఇన్‌జక్షన్ చేసి సిరంజి నర్సు చేతి కిచ్చి లేచి నిలబడి, "పరిస్థితి చాల తృప్తిగా వుందండీ. కొద్ది నీరసం తప్ప మరేం లేదు. ఈ రోజుకు రొట్టె, కాఫీ యివ్వండి. బహుశః రేపు అన్నం పెట్టవచ్చు అనుకుంటున్నాను," అన్నది సుశీల తల్లితో.

"నడిసముద్రము నుండి కాపాడి ఒడ్డు చేర్చినట్లు నా బిడ్డను రక్షించారు. మీ ఋణం తీర్చుకోలేను డాక్టర్," అన్నది ఆమె.

"అలా అనకండి. నే చేసిం దేమీ లేదు. అంతా దైవేచ్ఛ. నా వృత్తి ధర్మం నేను నిర్వర్తించాను అంతే," అని రాజుతో, "మందు వ్రాసిస్తాను. నేను వూళ్ళో కేసులు చూచుకుని వచ్చేసరికి పన్నెండుగంట లవుతుంది. అప్పటికి కొనితెస్తే ఈ రోజే మొదలుపెడదాం," అని ఆఫీసు రూములో కొచ్చి ప్రిస్క్రిప్షన్ వ్రాసి యిచ్చింది. ఆమెవద్ద శలవు తీసుకుని రాజూ, ఆనందులు వెళ్ళిపోయారు.




అసలే మానసిక వేదనతో క్రుంగి పోయే ఆనందును ఈనాటి ఈ హఠాత్సంఘటన పూర్తిగా వివశుణ్ణి చేసింది. గదిలో పడుకున్నాడేగాని మనస్సు వశం తప్పి అతి వేగంతో దారితెన్ను లేని రీతిలో పరుగులుతీస్తోంది. 'డా. శారదా దేవి! అవును ఒకనాడు తన సర్వస్వం అని తాను పరవసించిన బాలిక శారద. ఈనాడు తన కెట్టి సంబంధమూ లేని ప్రముఖ వైద్య విదుషీమణి. ఎట్టి పరిస్థితిలోను మరచిపోలేని శారదను తను పన్నెండు సంవత్సరాల తరువాత చూచినా ప్రథమ వీక్షణంలోనే పోల్చుకున్నాడు. అప్పటి తన శారద పంధొమ్మిది సంవత్సరాల బాలిక. ముట్టుకుంటే కందిపోతాయా అనే గులాబిచెక్కిళ్ళతో, తెల్లగా సన్నగా బొమ్మలా వుండేది. ఇప్పుడు పెద్ద మార్పు లేదు కాని, కొద్దిగా బొద్దుతేలింది. నల్లని నిడుపైన వాలుజడను ముడి చుట్టింది. ఎడమ చేతికి వాచీ, కుడిచేతికి ఏమీ లేవు: బోసిగా వుంది. మెడలో సన్నని బంగారు చైను, తెల్లని దుస్తులు, చేతిలో స్టెతస్కోపు- ఇది యీనాడు తను చూచిన తన శారద రూపం. ఎంత తప్పు భావన! తన శారద ఎలా అవుతుంది? ఎవరో ఆ భాగ్యశాలి? నా శారదతో జీవితాన్ని పంచుకోగల అదృష్టవంతుడు!

శారద సుఖంగా వుంది–తన కదే తృప్తి.

"శారద నన్ను గుర్తుపట్టలేదా? లేక హేయభావమా! తల యెత్తి గూడా చూడలేదు. నమస్కారం అన్నప్పుడు గూడా ఒక అపరిచితుని చూచినట్లే చూచింది. ఏ విధమైన హావభావాలు లేవు ముఖంలో. ఎంత ప్రశాంతంగా, గంభీరంగా మాట్లాడుతోంది! ఎంత హాయిగా మాట్లాడుతోంది!

'ఎలాగైనా శారదను కలవాలి. ఇంత కాలానికి కనుపించిన శారదతో మాట్లాడాలి. తన హృదయంలో పగిలి సర్వ వేళలా సెగలను కక్కే అగ్నిపర్వతాన్ని చూపాలి. తనతో మాట్లాడుతుందా? ఏమో? ఆ రోజుల్లో ఆమె దగ్గిరికి వెళ్ళాలనే ప్రయత్నాన్నిగూడా విరమించుకున్నాడు ముఖం చెల్లక.

'అబ్బ! ఇంక ఆగలేను. ఎప్పుడో గాదు, ఈరోజే వెళ్ళాలి. శారద తనను క్షమించి తనతో మాట్లాడుతుంది.' ఇలా ఆలోచిస్తూ బలవత్తరమైన ఆవేశాన్ని అణచుకుంటూ పడుకున్నాడు ఆనంద్. మానసిక వ్యథను భరించటం అతనికి అలవాటైన విద్య.

* * *

మధ్యాహ్నం ఒంటిగంటకి యిల్లు చేరి భోజనం అయిందనిపించి మేడ మీద కెళ్ళింది శారద. పరాకుగా రెండు మెతుకులు కతికి లేస్తుంటే, అలా వున్నారేమని అడిగింది వంటామె.

"ఏమీ లేదండి, బాగా తలనొప్పిగా వుంది," అనిచెప్పి వెళ్ళింది. తన గదిలో కెళ్ళి టేబిల్ మీద వున్న ఆనందు ఫొటో కెదురుగా కూర్చుని తదేకంగా చూస్తోంది.

'తన పేషంటుసుశీల భర్త ఆనంద్! తనకి తెలియకుండానే తన ఆత్మీయుని భార్యను మృత్యుముఖంనుండి కాపాడగలిగింది. ఇది తెలిసిన తనకు ఎంతో తృప్తిగా వుంది యీరోజు. ఇది భగవంతుని నిర్దేశము.

ఆనంద్ చాలా మారిపోయాడు. ఎప్పుడూనవ్వుతున్నట్లుండేముఖం చాలా గంభీరంగా వుంది. తనను ఏమాత్రం పోల్చుకున్నట్లు లేదు. అదే బాగుంది, కాని ... ఆజన్మాంతము ప్రతిక్షణము తాను మరువలేని ఆనంద్ తనను మరచిపోయాడు.' ఈఆలోచన రాగానే ఆమెకు దుఃఖం పెల్లుబికివచ్చింది. గతచరిత్ర సినిమారీలులాగ తిరుగుతోంది శారద కన్నులముందు.

* * *

శారద తండ్రి రామనాధంగారిది విశాఖ జిల్లాలోని ఒక పల్లెటూరు. రామనాధం దంపతులకు లేక లేక ఎంతో కాలానికి కలిగిన అల్లారు ముద్దుబిడ్డ శారద. శృంగేరిశారదాంబా వరప్రసాదమయిన ఆ బిడ్డకు శారద అని పేరు పెట్టారు. సంతోషం అనే కవచం యెప్పుడూ దుఃఖం అనే కిరీటాన్ని పైన

ధరించే వుంటుందన్నట్లు తమ నోముల పంట అయిన బిడ్డను చూచి వుప్పొంగి పోయేవారికి, గొడ్డలిపెట్టులాగ శారద పుట్టుకతో, అస్వస్థత ఆరంభం అయింది తల్లికి. బిడ్డ ముద్దుముచ్చటలయినా సరిగా చూచుకోకుండానే శారదకు అయిదవ సంవత్సరం పూర్తయేసరికి యిహలోక యాత్ర చాలించింది తల్లి. ఆ దెబ్బకు పూర్తిగా క్రుంగిపోయిన రామనాధంగారు వుద్యోగానికి రాజీనామా నిచ్చి, తన గ్రామానికి సమీపమైన విశాఖపట్టణంలో ఒక మేడకొని, అక్కడ స్థిరనివాస మేర్ప రచుకొని, తన సర్వస్వమైన శారదను అపురూపంగా పెంచుతూన్నాడు.

శారద హైస్కూల్ చదువులో వుంది. శారద పినతల్లిది కృష్ణాజిల్లాలో ఒక గ్రామం. ఆమె కుమారుడు భాస్కర్ శారదకంటె నాలుగుసంవత్సరాలు పెద్ద. వారి గ్రామంలో హైస్కూలు చదువు ముగిసిన భాస్కర్ రామనాధంగారి ఆహ్వానంమీద కాలేజీలో చేరటానికి వాల్తేరు వచ్చాడు. భాస్కర్ వూరికి రెండుమైళ్ళ దూరంలో వుండే చిన్న పల్లెనుండి భాస్కర్ వూరికి హైస్కూల్‌కు వచ్చేవాడు ఆనంద్. ఆనంద్, భాస్కర్ వకేక్లాసులో వుండేవారు. అతి సన్ని హితులు. వారి స్నేహబంధం విడరాని దయింది. భాస్కర్‌తో కలిసి కాలేజి చదువుకు వాల్తేరొచ్చాడు ఆనంద్. భాస్కర్, పెత్తండ్రి అయిన రామనాధం గారి యింట్లోనూ, ఆనంద్ హాస్టల్లోనూ, వుంటూండేవారు. ఆనంద్‌తరచువీరింటికి వస్తూండేవాడు – ఆదివారాలు తప్పకండా.

కాలపరిభ్రమణంలో నాలుగు సంవత్సరాలు గడిచాయి. వంటరితనం ఫీలయే శారద వాళ్ళిద్దరితోటీ సరదాగా కాలక్షేపం చేయటం చూచిన రామనాధం గారి మనస్సు కొంత తేలికపడింది. వయసులతోపాటు మనసులు గూడా పెరుగుతాయన్నట్లు పెరిగింది ముగ్గురి స్నేహలత. కొద్దిరోజులుగా ఆనంద్ శారదలలో ఏదోకొత్త గోచరించింది. భాస్కర్ లోలోన సంతోషించేవాడు.

శారద ఇంటర్మీడియేట్ పరీక్ష వ్రాసింది. ఆనంద్, భాస్కరులు బి. ఎస్సి. పరీక్షలు వ్రాసి శెలవులకు యిళ్ళకు బయలుదేరారు. ప్రతిసారీ వెళ్ళే ప్పుడు శారదను తనతో పదిరోజులు తీసికెళ్తానని బతిమాలేవాడు భాస్కర్. తండ్రిని వదిలి వకరోజు గడపలేనిశారద, కూతురును చూడనిదే క్షణం వుండలేని తండ్రి యింకోసారని వాయిదా వేసేవారు. అలాగే యీసారీ "శారదా యిప్పుడు నీవు రాక తప్పదు" అన్నాడు.

"నాన్నను వదలి వుండలేనురా. అంతకింటె మరేమీలేదు," అన్నది.

"రేపుపెళ్ళయితే అత్తారింటికెళ్ళవూ?"

"ఆయనగార్ని కొనేసి యింట్లోనే కట్టేసుకుంటుంది," అన్నాడు ఆనంద్:

"అంత యెగతాళిగా వుందిగాబోలు

నన్ను చూస్తే," అని బుంగమూతిపెట్టిన శారదను, "తమాషాకంటే అంత కోపమా!" అని బతిమాలుకున్నాడు ఆనంద్. మెల్లిగా నవ్వుకుంటూ అక్కడ నుండి తప్పుకున్నాడు భాస్కర్.

శలవుల్లో భాస్కర్ జాబులు వ్రాస్తూ వుండేవాడు. ఈసారి ఆనంద్‌గూడా వ్రాశాడు. వాళ్ళ జాబులతోనే, వాళ్ళను చూచినట్లు శలవులు గడుపుతోంది శారద.

పరీక్షాఫలితాలొచ్చాయి. శారద ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలయింది. రామనాథంగారి ఆనందానికి అవధులు లేవు. భాస్కర్, ఆనందు ఒభినందనులు తెలుపుతూ తంతులిచ్చారు.

బి. ఎస్సి. పేసయి ఎమ్. ఎస్సి. లో చేరారు అపూర్వ సహోదరులవంటి ఆనంద్ భాస్కరులు. ఫస్టుక్లాసులో పేసయిన శారదకు పుస్తకాలు బహుమతులుగా తెచ్చారు. భాస్కర్ ఇచ్చిన వాటిలో దీవిస్తూ ఎంతో వ్రాశాడు. ఆనంద్ యిచ్చిన వకేవక పుస్తకం రవీంద్రుని గీతాంజలి. తెరచిచూచింది. 'శారదకు — ఆనంద్' అని మాత్రమే ఇంగ్లీషులో వ్రాశాడు.

శారదను బి. ఎస్సి. లో చేర్పిస్తాననే రామనాథంగారితో 'ఎందుకండీ! హాయిగా మెడిసిన్‌లో సీటొస్తుందిగదా!' అన్నాడు భాస్కర్.

"చదివిస్తే మంచిదేకాని, అంతకన్న యెక్కువబాధ్యతే వుంది నామీద. నాకు వృద్ధాప్యం వచ్చినట్లేగదా! దేహధర్మాలు శాశ్వతంకాదు. ఇంతవరకు యెలా పెంచానో నాకే తెలియదు. ఈ రెండేళ్ళలో ఎక్కడైనా మంచి కుటుంబములోవాడు, అన్నివిధాలశారదకు తగినవరునివిచారించి వివాహం చేసి, వాళ్ళు చిలకాగోరింకల్లా చూచి, పిల్లాపాపతో కిలకిల్లాడుతూవుంటే సంతోషిస్తూ నా జీవితశేషం గడిపేస్తా. ఇదే నా కోరికా బాధ్యతా," అన్నాడు.

"మెడికల్లో చేరిస్తేమాత్రం మీకోరిక తీరదా? పెండ్లి అప్పుడూ చేయొచ్చుగా!"

"నిజమేనోయి. కాని, అది అంత సులభసాధ్యంకాదు. అయిదారు సంవత్సరముల చదువు. తీరా దిగాక చదువు పూర్తికానిద్దా మనపిస్తుంది. మధ్యలో వివాహం చేస్తే యేకారణంవల్లనైనా చదువు ఆగిపోతే బాధగా వుంటుంది. చదువు పూర్తిఅయాక యింకేదైనా సమస్య లొస్తే, ఇంకా కొంతకాలం జరగొచ్చు. అంత దీర్ఘకాలం నేను వుంటానో వుండనో, అప్పటిస్థితి ఆలోచించు. వివాహమనేది, స్త్రీ, పురుషులిరువురికీ ప్రకృతిసిద్ధమైన జీవన విధానం. ముఖ్యంగా మన దేశంలో యేకారణంవల్లనైనా వివాహానికి దూరమైతే పురుషుడు కొంతకాలం ఒంటరిగా జీవించగలిగినా, స్త్రీ అలాకాదు. ఆమెకి రక్షణ అవసరం. కాబట్టి నేను బ్రతికి వుండగా నా బాధ్యతలు నేను సక్రమంగా నెరవేర్చవద్దా నాయనా!" అంటున్న

ఆయనకన్నులు చెమ్మగిల్లినవి. అదిచూచి భాస్కర్ హృదయం జాలితో నిండింది.

"నిజమేనండి. అనుభవజ్ఞులు కనుక బాగాఆలోచించారు. నేనంతదూరంఆలోచించలేదు," అని ప్రసంగం మార్చాడు.

ఇంతలో అక్కడికి శారద వచ్చింది. "ఏమమ్మా, నిన్ను డాక్టర్ చదువుకు పంపాలని వుందట మన భాస్కరానికి."

"ఏదయితే యేమన్నయ్యా, నాన్న యిష్టమే నా సంతోషం," అంది శారద.

తృప్తిగా నిట్టూర్చారురామనాధంగారు.

* * *

ఆదివారం మధ్యాహ్నం అలవాటు ప్రకారం రామనాధంగారింటికి వచ్చిన ఆనంద్‌కు వరండాలోకి వినపడుతోంది భాస్కర్ రామనాధంగారల సంభాషణ.

"మన ఆనంద్ విషయంలో నీ అభిప్రాయం ఏమిటోయ్?"

"అంటే మీరడిగే దేవిషయంలో?"

"మన అమ్మాయి విషయంలో."

తికమక పడుతూ ఆలోచిస్తున్నాడు భాస్కర్. ఈయన మంచిగా అడుగుతున్నాడా లేక వీళ్ళ కలయిక యిష్టం లేకా? తనకు అత్యంత ఆప్తమిత్రుడు ఆనంద్. చెప్పుకోటానికి మాత్రమే చెల్లెలుగా గాక యీ నాల్గున్నర సంవత్సరాలుగా చెల్లెళ్లు లేని కొరత తీరుస్తూ అతిసన్నిహితంగా వుంటున్నది చెల్లెలు శారద. ఇద్దరూ ఉన్నతమనస్కులు. మనోగతాలా అంటే యిద్దరిదీ వకటే. వీళ్ళ యిద్దరికీ వివాహం జరగాలని తను ఆశిస్తున్నాడు. కాని యీ ముసలాయనకు ఆనంద్ స్టేటస్ చాలలేదా? జవాబుకై వెతుక్కుంటున్న భాస్కర్‌ను రామనాధంగారు "ఏంటోయి ఆలోచన," అన్నాడు.

"మీ రడిగింది అర్ధం కాలేదు. కొంచెం విపులంగా—" మాటపూర్తిచేయక ముందే రామనాధంగారు పెద్దగా నవ్వి—

"ఇంతేనా మరి మీ తెలివితేటలు. అయితే విను. ఆనంద్ శారదకు తగిన వరుడు అని నే నెప్పుడో నిర్ధారించాను. నీ ఉద్దేశ్యంగూడా కనుక్కుని ఆనంద్‌తో, అమ్మాయితో మాట్లాడుదామనున్నది."

"అంతకన్నా కావలసిన దేమున్నది. ఆనంద్ లాటి వుత్తముడు దొరకటం దుర్లభం. నాకూ యీ ఆశ వున్నది. వాళ్ళఇద్దరికీగూడా యిష్టమే."

"అని నేనూ పసికట్టానోయ్!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"కాని, పెదనాన్నగారు..." ఆపాడు.

"ఏమిటి నీ సందేహం?"

"ఆనందు స్థితిగతులు మీకు తెలుసుగద! తల్లితండ్రులు పూర్తిగా యితని మీదే ఆధారం. మరి...మీరు, శారదను వదలి వుండలేని పక్షంలో మీదగ్గరే వుండటానికి అతనికి వీలుండకపోవచ్చు: బహుశః వుండదేమో!"

"నే నంత మూర్ఖుడనా! నేను లోకంలో అందరిలాగే కన్యాదానం చేసి పంపుతాను. నా యిల్లు ఏమిటి? ఇదంతా

వారి దెగర! బిడ్డను చూడనిదే వుండలే ననిజాలి కలుగుతే అంతాయిక్కడేవుండ వచ్చు. వారి కలా కుదరకపోతే నేనే వారి దగ్గరకి పోయుంటాను. వద్దంటారా?" అన్నారు రామనాధంగారు నవ్వుతూ.

"మీ హృదయం చాలా గొప్పదండీ; అర్ధం చేసికోలేకపోయాను. ఆనందుతో త్వరలోనే మాట్లాడుతాను." ఇద్దరూ లేచారు. వీరి సంభాషణ ఆగిపోయింది అని తెలిసి మెల్లిగా లోపల కొస్తున్న ఆనందుకు తలవంచుకుని నిల్చున్న శారద కనుపించింది. ఆమె అప్పుడే రికార్డు వ్రాయటం పూర్తిచేసి తన గదిలోనుండి వస్తూ వీళ్ళ సంభాషణ వినపడి ఆగి నిలబడి వింటున్నది. అలికిడికి తలెత్తిన శారదకు ఆనందు కను పించాడు చిరునవ్వుతో.

"ఆ మర్నాడే ఆనందుతో మాట్లాడాను. చాలా సంతోషంగా అంగీకరించాడు. వాళ్ళ పెద్దలు వాడి యిష్టానుసారమే చేస్తార్ట. కాని యీ సంవత్సరంతో వాడి చదువు, శారద బి. ఎస్సి. పూర్తి అవుతాయి గనుక అంతవరకు ఆగమనీ, ఆ తరువాత వాళ్ళవాళ్ళతో చెప్పొచ్చనీ అన్నాడు," అని భాస్కర్ చెప్పాడు. ఆనంద్ వస్తే యిదివరకటంత ఫ్రీగా మాట్లాడలేకపోతోంది శారద. తనకి తెలీకుండా భయమూ, సిగ్గూ ఆవరించేవి.

ఆరోజు తనకి బాగాగుర్తు. ఆదివారము - సాయంత్రం నలుగురు కూర్చున్నారు టేబిల్ ముందు. టిఫిన్ ప్లేట్లు పెట్టి వెళ్ళాడు నాయరు. ముగ్గురూ తింటున్నారు. ఆనంద్ యింకా తీసికోలేదు.

"ఆనంద్ తీసికోలేదేం?'' అన్నది భాస్కర్‌తో

"ఏమో, నీవే అడుగు వాడిని," అన్నాడు భాస్కర్.

"నీవు పద్ధతి మార్చుకోవాలమ్మా. అతన్నలా పిలుస్తుంటే బాగుంటుందా? మొగవాడి పెంపకం అంటారు;" రామనాధంగారన్నారు. భాస్కర్ నవ్వాడు.

ఆయన మాటలకు కొంటెగా తన వైపు చూచి సిగ్గుతో గులాబివర్ణం దాల్చిన ముఖం దించి కూర్చుంది. ఆరోజునుండి అతన్ని మన్నించిపిలవటం నేర్చుకుంది.

సుఖసంతోషాలతో గడిపే కాలం యెందుకో త్వరగా పరుగెత్తిపోతుంది. ఆడుతూ పాడుతూ సంవత్సరం గిర్రున తిరిగింది. పరీక్షలు ముగిసి సెలవులకు ప్రయాణమయారు మిత్రులిద్దరూ.

వెళ్ళేరోజు రామనాధంగారింట్లో భోజనాలు చేసి మాట్లాడుతూకూర్చున్నారు నలుగురూ. 'త్వరలోనే మంచి చూచి మీ నాన్నగారితో మాట్లాడటానికి వస్తా'నని ఆనందుతో చెప్పారు రామనాధంగారు.

టైమవుతోందని లేచారు. వీడ్కోలివ్వటానికి రైల్వేస్టేషనుకు రాలేనని తలనొప్పిగా వుందని చెప్పి తన గదిలో కెళ్ళి పడుకుంది శారద.

శారదతో చెప్పివస్తానని గదిలోకి

వెళ్ళాడు ఆనంద్. ఆ గదిలో కెళ్ళిన ఆనంద్ మెల్లిగా శారదకు దగ్గరగావెళ్ళి, "నిజంగా రాలేవా శారదా, రైలు కదిలే వరకు దగ్గిరే వుంటా వనుకున్నాను."

"తరువాత ?"...

"నీకూ తెలుసుగా."

"రైలు వెళ్ళేవరకు దగ్గిరుండి మీ రెళ్ళిపోయాక వంటరిగా యింటికొచ్చిన నా కెలావుంటుందో మీ కేం తెలుసు ?"

"పోనీ జంటగా వెళ్దాము రారాదూ?"

"అవును పాపం!"

"ఏం ?"

"నాన్న చెప్పినట్లు వినివుంటే యీ రోజు అలాగే వెళ్ళే వాళ్ళం."

"అలా జరిగినట్లుంటే అమ్మాయి గారికి యీ డిగ్రీ వచ్చేదికాదు. చదువుకు ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టవలసివచ్చేది."

"ఎందువల్ల ?"

"అమ్మాయి అత్తమామలు శుద్ధ ఛాందసులు. అమ్మాయి కళాశాలకు వెళ్ళాలంటే అనుమతివ్వరు. అందువల్ల అపానుగాని, నిజంగా ఎంత త్వరపడు తున్నానో తమర్ని వదలివుండలేక;" ఇద్దరూ నవ్వుకున్నారు హాయిగా.

"కోపంపోయినట్లేగా! యిక లేచిరా."

"ఇప్పుడొస్తే అన్నయ్య ఎగతాళి చేస్తాడు, రా," నన్నది శారద.

రామనాథంగారు వెళ్ళి ఆనంద్, భాస్కర్‌లకు వీడ్కోలిచ్చివచ్చారు.

* * *

వచ్చి పదిరోజులు దాటింది. పాలేరుతో యేదోవుత్తరం పంపాడు ఆనంద్ భాస్కర్‌కు. విప్పి చదువుకున్న భాస్కర్ కంపించిపోయాడు. కర్తవ్యం ఆలోచిస్తూ మళ్ళీ చదువుకున్నాడు –

"మా నాన్న దానధర్మాలతో అప్పులు పెరిగి ఆస్తితాకట్లలో వుంది. నిలువదని నాకు తెలుసు. అంతవరకు మాత్రమే తెలిసిన నేను అ వ్యవహారాలను గురించి ఎప్పుడూ వివరంగా అడిగి తెలుసుకో లేదు. ఆయన చెప్పనూలేదు. నావంతు హక్కుగూడా నాన్న పేర వ్రాసిచ్చేశాను. అంతవరకూ నీకూ తెలిసినవిషయమే. కాని సంవత్సరంక్రితం నేను శలవులయి వాత్తే రెళ్ళాక ఆస్తిఅంతా వేలం అయిం దనీ, దానితో బాకీలు పూర్తి కాలేదనీ, మిగిలిన బాకీలకు ఆరేస్టువారం టొచ్చిం దనీ, ఆ ఆపదసమయంలో పచ్చగా వున్నప్పుడు భరించలేని బంధువు మా మేనత్తభర్త ఆదుకున్నాడనీ. తత్ఫలి తంగా అప్పులు తీరటమేకాక నా చదువు ఆగిపోకుండా పూర్తయిందనీ, అంటే యీ సంవత్సరం నుండీ నా ఖర్చులు వారే భరిస్తున్నారట నాకు తెలియ కుండా. ఈ ఋణ విమోచన క్రింద నన్నూ, నా భవిష్యత్తునూ వారికి అమ్ముకున్నారు నా తండ్రి. ఇంకా కొంచెం విపులంగా చెపుతాను జాగ్రత్తగా విను. వారి బాకీక్రింద వారి కుమార్తెకు భర్త అనే పేరుతో బందీని చేశారు

నన్ను. అదీ ఖరార్ తెలిసిందా! మెల్లిగా నిన్న నా చెవిన వేశారు ఈ విశేషం. నాకు ముందే తెలిపితే పరుల సొమ్ము వాడుకోడం యిష్టపడక చదువు ఆపేస్తానేమో – చదువు పూర్తయితే కుటుంబ పరిస్థితులు తిరిగి బాగవుతాయి అని యిదంతా నానుంచి గోప్యంగా వుంచారట. బాగా అర్ధం అయిందా? అదివరలో ఎన్నడూ వారికి బంధువుగా గూడ తగని నేను పోస్టుగ్రాడ్యుయేట్ని గనుక అల్లుడుగా తగివుంటా నను కున్నారు. నిన్నటినుండీ ఏమైపోతు న్నానో ఎక్కడున్నానో నా కేమీ తెలియ టంలేదు. పిచ్చెక్కితే అవుననిపిస్తున్నది. నన్ను అసత్యవాదిని చేయకు అని శాసించే తండ్రి కేమి చెప్పను? ఉత్తముడ ననుకుని భ్రమపడే సోదర సమానుడ వైన నీ కేం చెప్పను. నామీద యెన్నో ఆశలు పెంచుకున్న రామనాధంగారి కేమి చెప్పను. ఇన్నింటినీ మించి నేనే సర్వ స్వము అని నమ్మిన శారద నేమిచేయను? మనసులేనిఆమెతో ఎలా జీవించను? భాస్కర్! నా కేదైనా మార్గం చూప గలవా? నాకు తోవలేదు. అగాధమే! నీకు తెలుపటం నా విధి అని వ్రాస్తు న్నాను. ఏమి జరుగనున్నదో! శలవు.

ఆనంద్"


ఏమీ తోచదు. ఏమి చేయాలి? కర్తవ్యం స్ఫురించిన భాస్కర్ సాయం త్రం ఆనంద్‌వద్ద కెళ్ళాడు. ఆనంద్ పసిబిడ్డలాగ చుట్టుకుపోయాడు. ఆనందు తండ్రితో విషయమంతా మాట్లాడి ఆయన్ని యెలాగైనా వప్పించాలని చూచాడు భాస్కర్. శారద సొమ్ముతో వారి బాకీ తీరుద్దాము అన్నాడు. ఆయన వప్పుకోలేదు. మనసులు కలిసినవాళ్ళ యిద్దరినీ విడదీసి వ్యధపాలు చేయకండి అని వేడుకున్నాడుభాస్కర్. కాని ఆయన మారలేదు. "పదిమంది పెద్దమనుష్యుల ముందర వప్పందం–వాళ్ళు ఒప్పుకోరు. నేనాడితప్ప." ననే మాటమీదే వున్నాడు.

"వాడు వప్పుకోకపోతే ఏమిచేస్తారు? మీరు వాడితో చెప్పి చేశారా?" అన్నాడు.

"నా కా మాత్రం హక్కుందనే చేశాను. ఒప్పుకోకపోతే పొమ్మను, బాధ్యతారహితంగా," అన్నాడు. భాస్కర్ నిస్పృహతో వెళ్ళిపోయాడు.

* * *

తాను వెళ్ళాలనే ఆలోచనలో వుండగా తలవనితలంపుగా వచ్చిన భాస్కర్ని చూచి ఆశ్చర్యపోయారు రామనాధం గారు. ఆరోజంతా యేమీ చెప్పకుండానే గడిపేశాడు. మరురోజు ఎలాగో చెప్ప లేక చెప్పేశాడు భాస్కర్. భారంగా నిట్టూరుస్తూ అన్నారు రామనాధంగారు; "నన్ను ఎప్పుడూ కఠిన పరీక్షలకు గురిచేస్తూవుండటం ఆ సర్వేశ్వరుడికి పరిపాటి. కానీ యేమిచేస్తాను. ఒక విధంగా స్థిరసంకల్పం లేని అంత బల హీనుడికి కాకపోవటంగూడా మంచిదే!"



"స్థిరం లేనివాడు కాదు. కాని ఈ పరిస్థితిలో నే నేమీ చెప్పలేను మీకు."

"ఊఁ... సరే, కానీ, ఎవరికెవరు రాసి పెట్టివున్నారో! నింపాదిగా మనమూ ఆలోచించుదాము," అన్నారు. అంత వరకూ మౌనంగా కూర్చున్న శారద లేచి వెళ్ళింది. ఒక గంటతరువాత శారద గదిలో కెళ్ళాడు భాస్కర్. టేబిల్ మీద చేతుల్లో ముఖం దాచుకుని వుంది. "శారదా!" అన్నాడు. తలెత్తింది శోక భారంతో ముఖం వుబ్బిపోయింది. "నీవు యిలా యేడిస్తే నాన్న ఏమనుకోవాలి చెప్పు. ఈబాధలో భాగం నాకూవుంది. పరీక్షాసమయాన్ని ధైర్యంతో యెదుర్కోవాలి..." అంటూ తలనిమురుతున్న భాస్కర్ చేతుల్లో ముఖంపెట్టి దుఃఖించింది. ఆవేశం తగ్గాక లేచి "వాళ్ళవాళ్లు ఒప్పుకోరని అతనికి మొదలే అనుమానమేమో!" అన్నది.

"ఛ, కాదు. వాడు దగాకోరుగాదు. చాలా వుత్తముడమ్మా. ఎలా వున్నాడో తెలుసా యిప్పుడు – పిచ్చివాడిలాగ వున్నాడు. ఏమీ చెప్పలేని పరిస్థితిలో వున్నాడు. చూడు ఎలా రాశాడో." అని వుత్తరం యిచ్చాడు. చదివింది. ఇద్దరూ ఎంతసేపో మౌనంగా కూర్చున్నారు. బాధగా లేచాడు భాస్కర్.

వెళ్ళిపోతున్న భాస్కరుతో "నే నేమీ బాధ పడటంలే దన్నయ్యా. అతని దగ్గిరి కెళ్ళి, నాతండ్రి నాకేంతో తన తండ్రి తనకు అంతే కనుక తనబాధ్యతే తనకు ప్రధానమని సంతోషంగా చెప్పా నని చెప్పు," అన్నది.

* * *

మెడిసిన్‌కు అప్లై చేస్తానన్న కూతురుతో "అదేమిటమ్మా! వద్దు తల్లీ! త్వరలో నిన్నొక గృహిణిగా చూడాలని వుంది," అన్నారు రామనాథంగారు.

"క్షమించండి నాన్నా! ప్రస్తుతం నేను అంగీకరించలేను. నా మన స్సేమీ బాగాలేదు," అంది. కొంతవాదన జరిగాక వప్పుకున్నారు. తండ్రి పెళ్ళి అన్నప్పు డల్లా యిప్పుడుకాదు అంటూనే చదువు పూర్తి చేసింది హౌస్‌సర్జన్‌పూర్తయింది.

గవర్న్మెంటు డాక్టరుగా చేరిన శారదను హైద్రాబాదునుండి ఆరునెలలకే విశాఖకు మార్చారు. అప్పటికే మానసికంగానూ, శారీరకంగానూగుడా వృద్ధులైన రామనాధంగారు హఠాత్తుగా గుండె ఆగి మరణించారు. ఆ దెబ్బకు తట్టుకో లేని శారద ఎంతోకాలంవరకు పిచ్చిదాని లాగా అయింది. మెల్లిగా తలెత్తి భవిష్యత్తువైపు చూచింది. తిరిగి వుద్యోగంలో చేరగానే గుంటూరు వేశారు. ఇంకెలాగూ నాన్నలేనియింట్లో ఎప్పుడైనాగూడా గడపలే ననుకుని వైజాగ్‌లోని స్వంతయిల్లూ, స్వగ్రామంలోని భూములూ అన్నీ అమ్మి డబ్బుచేసింది. ఈవూరు హాయిగా వుందనిపించింది. వెంటనే ఆ వుద్యోగానికి రిజైనిచ్చి స్వంత ఖర్చుతో భారీయెత్తున వైద్యశాల తెరిచింది నాల్గుసంవత్సరాలక్రితం. వైద్య పితామహులవంటి డా. శంకరరావుగారి వద్ద సలహాలు పొందుతూ వుంటుంది. ఏకాకి అయిన శారద శంకరరావుగారి హృదయంలో పుత్రికాస్థానం ఆక్రమించు కున్నది. డాక్టరుగా త్వరలోనే మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఆమె పుట్టక ముందునుండి తమయింటి నౌకరు అప్పన్న, ఎన్నిమార్పు లొచ్చినా శారదను వదలక, సేవ చేస్తూ కనిపెట్టుకుని యింట్లో వున్నాడు. ఆమె నర్సింగ్ హోమ్ ఎదురుగా మేడలో కాపురం వుంటూంది. ఈరోజు పెద్దహాస్పిటలు, ఇల్లు, కారు, మంచిసంపాదన, చక్కని పేరుగల డాక్టరు శారద. కాని, ఎవరికీ ఎందుకూ కాని వంటరిజీవి.

ఆలోచనా భారంతో యెంతకాలం గడచిందో తెలియని శారద, మెల్లగా జాగ్రదవస్థలోకి వచ్చింది. ఏమిటిది! ఇలా అయిపోతున్నాను! నాలోని ధీరత్వం యిదేనా! వక్కసారి అతను కనుపించగానే యింత బలహీనమా; అనుకుంటూ లేచి ముఖం కడుక్కొని టీ త్రాగి, "ఈపూట డ్యూటీకిరాలేను. అత్యవసర మయితే పిలవండి." అని కాంపౌండరుకు చెప్పి ప్రశాంతంగా తోటలో

పచ్చికమీద కూర్చుని యెల్లప్పుడూ ఆత్మబలా న్నివ్వగల గ్రంథం 'వివేక సూర్యోదయం' చదువుతోంది.

వాకిట్లో నిలబడి డా. శారదాదేవి, బి. ఎస్సి., యం. బి. బి. యస్. అన్న బోర్డు చూస్తున్న ఆనంద్, వాకిట్లోనుండి లోనికి పోతున్న అప్పన్నను చూచాడు. అప్పన్న ఆనందుని గుర్తుపట్టలేదు. ఆనంద్ గుర్తించాడు.

"డాక్టరుగారున్నారా ?" అడిగాడు.

"వున్నారుబాబు, దయచేయండి. లోనకెల్లండి. తోట్లోవున్నారు పిలుత్తాను" అన్నాడు.

"వద్దులే అక్కడికే తీసికెళ్లు."

'ఎవురో వచ్చారమ్మా' అన్నమాట విని తలెత్తినశారద ఆనందునిచూచి వులికి పడింది. తొట్రుపాటు కనుపించనీయ కుండా "ఓ! మీరు సుశీలాదేవిగారి భర్త గదూ! రండి లోపలికి. ఈపూట ఆమెను చూచారా ? బాగా తేలికగా వున్నారను కుంటాను," అంటూ లోనికి తీసికెళ్ళింది.

డ్రాయింగ్ రూములో కూర్చుని ఏం మాట్లాడాలో తెలియక దిక్కులు చూస్తున్నాడు ఆనంద్. తిరిగి ఆమే అంది "మీరు ఆమె ఆరోగ్యంగురించి మాట్లాడ టానికి వచ్చారనుకుంటాను. ఏమికావాలో అడిగితే చెపుతాను."

"శారదా!" అన్నాడు యెంతో మెల్లగా.

దిగ్భ్రమ చెందిన శారద ఆశ్చర్యంతో చూస్తోంది అతన్ని. పావుగంటగడిచింది.

"ఇంకా నన్ను పోల్చుకోలేదా శారదా! నన్ను సుశీలభర్తగా మాత్రమే ఎరుగు దువా ?"

నిమిషాలు దొర్లిపోతూనే వున్నాయి.

"క్షమించండి డాక్టర్! ఇక వెళ్తాను," అని లేవబోయాడు.

"ఆనంద్!" అంది ఆవేశాన్ని అణచు కుంటున్నట్లుగా.

"శారదా!"

"క్షమించండి. నన్ను మీరు శారదగా తెలుసుకోలేదనే భ్రమలో వున్న నేను అది భ్రమ అని తెలిసుకుని ఆశ్చర్యంలో వుండి మాట్లాడలేక పోయానే గాని మిమ్మల్ని అవమానిచాలనిగాని మరే యితర వుద్దేశ్యమూలేదు," అంది.

"నిన్ను పోల్చుకోలేనా శారదా! జీవితంలో మరువలేని దేదైనా వుంటే అది నీవే శారదా..."

"విశేషమే!"

"ఎగతాళిగా వుందా ? అవును అలాగే వుంటుంది నే చేసిన పనికి."

"ఇప్పుడా సంభాషణేమీ వద్దు. ఇన్ని రోజుల సంగతులు యింకేవైనా మాట్లాడు కుందాము." ఇలా అంటూవుండగానే "మిస్. శారదాదేవీ! ఏమిచేస్తున్నావు?" అంటూ డా. శంకరరావుగారు వచ్చారు. ఆనందును తన స్నేహితుడుగా పరిచ యము చేసింది శంకరరావుగారికి. కొద్ది సేపు ముగ్గురి మధ్య సంభాషణ జరిగింది. డాక్టర్లిద్దరూ మరురోజు తాము వెళ్ళవల

సిన మీటింగు గురించి చర్చించుకుంటు న్నారు. రాత్రి యెనిమిదిగంట లైంది.

"ఇంకోసారి కలుస్తాను," అని విసుగ్గా లేచాడు ఆనంద్.

గేటువరకు వచ్చిన శారద "కనీసం వకరోజు నా అతిధిగానైనా ఆహ్వానిస్తు న్నాను మిమ్మల్ని. దయవుంచి అంగీక రించరూ," అన్నది.

"నా కది ఒక మహాద్భాగ్యం శారదా; తప్పక వస్తాను.

"అలాగయితే రేపంతా నాకు విరా మంలేని కార్యక్రమం వుంది. పగలు అయితే ఎన్నిగంటలకి భోజనం అయేది చెప్పలేని స్థితి నాది. అందువల్ల ఎల్లుండి మధ్యాహ్నం వచ్చేయండి. సాయంత్రం కాఫీ, రాత్రిభోజనం అయాక వెళ్ళొచ్చు."

రిక్షా దిగుతోన్న ఆనంద్‌ను, ఎదురెళ్ళి అహ్వానించింది లోనికి. కాఫీలు, ఫలహా రాలు స్వీకరించారు. ఇల్లు, తోట తిప్పి చూపెట్టింది. మేడమీది కెళ్ళారు. మేడ మీద రెండే గదులు. ఒకటి రీడింగ్ రూము, రెండోది బెడ్‌రూము. రీడింగు రూములో గోడకు రామనాధంగారి లైఫ్ సైజ్ ఫోటో వున్నది. దానినే చూస్తున్న ఆనందుతో అయిదు సంవత్సరాలు దాట బోతున్నాయి అన్నది. ఆనందు కన్నులు గూడా జలపూరితా లయినాయి. బెడ్ రూమ్‌లోకి తీసికెళ్ళలేదు. బైట కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"తల్లిదండ్రుల విషయంలో బాధ్యతే ప్రధానమని నాకు కబురు చేసిన నీవు నీ తండ్రి విషయంలో ఆ బాధ్యతను పాటించగలిగావా?" అని హటాత్తుగా అడిగాడు ఆనంద్.

కొన్ని క్షణాలు విచలితురాలయిన శారద తెప్పరిల్లి "నాన్న విషయంలో నే నేమీ లోపం చేయలేదే," అంది.

"అలా అంటే సరా! నీ వివాహం చేయాలనే ఆయనకోరికఎందుకుతీర్లేదు?"

"సాధ్యం కాలేదు."

"అదేఎందువల్లఅని అడుగుతున్నా."

"ఆ విషయం యిప్పుడు అప్రస్తుతం"

ఒక వృక్షానికి అల్లుకుంటున్న లతను బలవంతాన లాగి వేరొక వృక్షానికి నాటితే మాడిపోతుంది కాని అల్లుకుం టుందా చెప్పండి," అన్నది.

"నీలో మార్పురాదా శారదా?" దీనంగా అన్నాడు.

"మనస్సు అనే దృశ్య పదార్థం వక్కటేగద! ఆ ఒకటి వకరికిమాత్రమే దత్తం అయిపోతుంది. దాన్ని తిరిగి తీసుకుని అర్పించగలమా? లేదు. నావల్ల కాలేదు; కాదుగూడాను."

"ఆపని పురుషుడనైన నేను చేయ గలిగాను."

"అప్పటి మీ బాధ్యతా, నా అదృష్టం అలా వున్నాయి. ఏంచేస్తాం. ఇంక అది మరచిపోదురూ."

"మరచిపోగలనా శారదా! వివా హానికి విముఖంగా వున్నావని భాస్కర్



యువ

ద్వారా విని ఎంతో ఏడిచాను. భాస్కర్ అమెరికా వెళ్ళినతరువాత నీ జాడే తెలియక తపించిపోయినాను. ఎలాగో చూడగలిగాను కాని, నీ యీ వంటరి జీవితాన్ని చూచి యెలాటిబాధ ననుభ విస్తున్నానో యెలా చెప్పను? ఇందుకు బాధ్యుడను నేనేగదా.''

ప్రసంగం మార్చే వుద్దేశ్యంతో, నాకు వంటరితన మేమిటండీ. నా నర్సింగ్‌హోమ్ నాకు కుటుంబంలాంటిది. వారంతా నావారే. ఎంతఆశతో, ప్రేమతో చూస్తారు నాకేసి. వారిసేవలో కాలాన్ని గూడ గమనించలేని అనిర్వాచనీయమైన ఆనందం వుంది. నావల్ల బాధోపశమనం కలిగినవారు ఎంతో గౌరవిస్తారు. ఎవరిదాకానో ఎందుకు, మీ అత్తగారువాళ్ళు చూడండి. నేనే సుశీలను బ్రతికించినట్లు సంతోషిస్తున్నారు. ఇలాటి వాతావరణంలో తృప్తిగా జీవిస్తున్నాను. ఇంకేం కావాలి నాకు?''

''నీ కొక రహస్యం చెప్పనా?''

''ఏమిటది?''

''నీవు నా స్నేహితురాలు శారదఅని తెలిస్తే నీమీది గౌరవస్థానంలో ద్వేషం ప్రబల్తుంది వారికి. అదితెల్సి మసలుకో.''

''ఆఁ... అంది విస్తుబోతూ.''

''మరేమనుకున్నావు. మానవులలోనే దానవులుగూడ వున్నారు శారదా.''

"భోజనాలకి రండమ్మా!" అన్నాడు గదిలో పక్కేసె పూలపళ్ళెం పెట్టి వెళ్తూ అప్పన్న.

"అప్పన్నా, ఇట్రా. ఈయనగా రెవరో తెలియలేదా!"

''లేదు చిన్నమ్మా!''

"మన ఆనంద్, అప్పన్నా!"

'ఆఁ!' అంటూనే 'ఆనందంబాబూ!" అంటూ కాళ్లుచుట్టేసుకున్నాడు అప్పన్న. 'ఇన్నాళ్ళకి గెపితికొచ్చామా బాబూ' అంటూ కన్నీరొత్తుకోసాగాడు. ఆ సమయంలో శారద ఆనందులగ్గూడా కన్నీరు స్రవించింది. కిందికెళ్ళి భోజనాలు చేసి వచ్చి కూర్చున్నారు.

"ఒకమాట డగనా శారదా?"

"అడగండి."

''ననంతా అయి యింటి కొచ్చేసరికి యీ వంటరితనం బాధగాలేదా? రాత్రులు భయం వుండదా?''

"అలవాటయింది. ఇంట్లో పనివాడుగా కాక తన బిడ్డలాగ కంటికి రెప్పలాగ కాచుకునే అప్పన్న వున్నాడు. దగ్గరలో నర్సింగ్‌హోమ్‌లో పగలు, రాత్రిగూడా డ్యూటీ చేసే పనివారున్నారు. అన్నింటినీ మించి నన్ను రక్షించుకునే అంగరక్షకులు నా హృదయం పైనా, లోపలా గూడా వుండి రక్షించుకుంటున్నారు. ఇంక నాకు భయ మేమిటి?"

ఆమె చివరిమాటల అర్థాన్ని వెతుక్కుంటున్నాడు ఆనంద్. ఇద్దరిమధ్య మౌనం తాండవిస్తోంది. నీలవేణి అనే నైట్‌డ్యూటీ నర్సు వచ్చి డెలివరీకేసు వచ్చిందని చెప్పింది. "ప్రవేశపెట్టి

యేర్పాట్లు చూడు; వస్తున్నా." ననిచెప్పి లేచి గదిలో కెళ్ళి తెల్లని దుస్తులు వేసు కుని ఐదు నిమిషాలకు బైటకొచ్చి "పని పూర్తవగానే వచ్చేస్తాను. నేవచ్చేవరకు వెళ్ళకం" డని ఆనంద్‌తో చెప్పివెళ్ళింది.

అప్పన్నను పిలిచి కబుర్లలోకి దిగాడు ఆనంద్. ఇన్ని సంవత్సరాల కబుర్లు చెప్తున్నాడు. "పెద్దోడి నయాను బాబు. అయ్యగారు పోతూ చిన్నమ్మను ఎలాగ కాపాడతావో అని అప్పగించి పొయ్యారు. నేనూ యెప్పుడు రాలి పోతానో. ఆరోజు ఈమె నేరి కప్పగిం చను." అని కన్నీరు కార్చాడు. అప్పన్న కేమీ చెప్పలేక సన్నగా నిట్టూరుస్తూ కూర్చున్నాడు. పది దాటింది. అప్పన్నను పడుకోమని పంపేశాడు.

రీడింగురూములోకి వెళ్ళాడు. ఆలో చిస్తూ బల్లమీదున్న డైరీ తీసి తిరగే శాడు. అన్యమనస్కంగా పేజీలు తిరగే స్తున్నాడు, పేజీ తిప్పుతూ తేదీ చూచి జాగ్రత్తగా చదివాడు. '16 నవంబరు 62. వారముగా మృత్యువుతో పోరాడి కాపాడగలిగిన సుశీల నా ఆత్మీయుడైన ఆనంద్ భార్య. నా వృత్తి నన్ను మిక్కిలి ఆనందపరిచింది, యీవిషయం తెలిసి.'

'ఎంత ఉన్నతమైనమనస్సు శారదానీది; నే నెంత దురదృష్టవంతుణ్ణి' అనుకుంటూ పేజీ తిప్పాడు. తరువా తేమీవ్రాయలేదు.

'కొద్దిసేపుగూడా తృప్తిగా మాట్లాడ టానికైనా కుదరలేదు శారదకు. నిద్రా హారాలు గూడా సమయానుకూలంగా దొరకని యీ వృత్తిలో తన్నుతాను మరచిపోవాలని శారద ప్రయత్నం. ఆమె జీవితంలో ప్రవేశించి, ఆమెను పొందలేక, చివరకు ఆమెను విరాగినిగా, రోగి నారాయణ సేవలో జీవితాన్ని గడిపే లాగ చేశాను. మనసు మండిపోతోంది, ఈ మంట ఆరేదిగాదు,' అని తలపోస్తూ ఆలోచనా భారంతో సోఫా మీద వాలిన ఆనంద్‌కు మగతగా కునుకుపడుతున్నది.

పదకొండున్నరకు వచ్చింది శారద. కాళ్ళుచేతులు కడుక్కొని బట్టలు మార్చు కునివచ్చి సోఫాలో పడుకున్న ఆనంద్‌ను చూచి పనిలో నిమగ్నమైన తను యింటి సంగతే మర్చిపోయింది. అప్పన్న పక్కయినా వేయలేదు అని బాధపడి. లేపటం యిష్టంలేక, టేబిల్‌ఫానుదగ్గరగా పెట్టి, శాలువ కప్పి తనగదిలోకెళ్ళింది. పడుకుంటే నిద్రరాలేదు. తనింట్లో, పక్కగదిలో ఆనంద్ నిద్రపోతున్నాడు. అనుకోని సంఘటన! ఏ మాలోచిస్తోందో, ఎంతసేపు దుఃఖించిందో తెలియదు.

తెల్లవారురూము మూడుగంటలకు మెలకువవచ్చిన ఆనంద్ లేచి చూచాడు. పక్కగదిలో లైటు వెలుగుతూనేవుంది. తలుపు తీసేవుంది. గదిలో కెళ్ళాడు. వాల్తేరులో వున్నప్పటి తనఫొటో జాజి మాలతో అలంకరింపబడి టేబిలుమీద వుంది. తనకి జాజిపూవులంటే ప్రీతి అని యిది చూచి గుర్తువచ్చిం దతనికి.

ఈ నిర్భాగ్యుణ్ణి యెంత పవిత్ర ప్రేమతో ఆరాధిస్తున్నావు శారదా! అని తనలోనే తలపోస్తూ శారద పడక దగ్గిరికి నడిచాడు. శారద మెడలోని చైను పమిట బైటికి పడివుంది. దాని రాకెట్ లోది తన బి. ఎస్సినాటి ఫొటో! అర్థమైంది. హృదయంలోపలా పైనా వుండి కాపాడే అంగరక్షకుడు తను ఆమెకు! ఎంత మధురమైన భావన ఆమెది! అబ్బ!

అప్రయత్నంగా శారద పడకమీద కూర్చున్నాడు. శారద బుగ్గలపైన కన్నీటిచారికలు పేరుకొని ఎంతో దుఃఖించినట్లు తెలుపుతున్నాయి. కనురెప్పలు యింకా తడి ఆరలేదు. మెల్లిగా వంగి రెండు చేతులతో ఆ ముఖాన్ని పట్టుకుని రెప్పది తడి సున్నితంగా వత్తుతున్నాడు. ఈ దుఃఖానికి బాధ్యుడను నేనుగదా అనుకుంటూ అలాగే వున్నాడు. ఒకనాడు తనను పులకింపచేసిన గులాబీ రేకులవంటి ఆ పెదవుల చెక్కుచెదరని సౌందర్యాన్ని చూస్తూ కూర్చున్నాడు.

స్పర్శకు తెలివివచ్చిన శారద కన్నులు తెరచి ఆనందుని చూచి కలా నిజమా అనే సందేహంతో తనచెక్కిళ్ళపైనవున్న ఆ చేతులను పట్టుకుంది. కల గాదు; యదార్ధమే! నిశ్చేష్టురాలయింది. "ఆనంద్! ఏంటిది! ఇంతబలహీనమా! లేవండి," అంది.

తానే స్థితిలో వున్నదీ తెలుసుకుని లేచాడు. 'నా ప్రవర్తన అర్ధరహితంగా వుండొచ్చు - దురుద్దేశ్యంలేదు శారదా!" అంటూనే పక్కగదిలో కెళ్ళిపోయాడు.

తెల్లవారి గదిలోనుండి బైటకు వచ్చిన శారదకు యింట్లో ఆనందు కనుపించలేదు. కోపం వచ్చి వెళ్ళాడా? తాను అతని అంతర్యాన్ని అవగతం చేసుకోలేక అనుచితంగా మాట్లాడిందా? అవమానంతో చెప్పకుండానే వెళ్ళిపోయి వుంటాడు. అతని వద్దకు తాను వెళ్ళగలదా? తిరిగి ఎన్నడైనా కనుపిస్తాడా? యిదే వ్యధతో ప్రతి క్షణం గడుపుతోంది. వారంరోజుల తరువాత యింటికి వచ్చి టపా చూచుకుంటున్నది. కవరు చించి ఉత్తరం బైటికి తీసిన ఆమె ముఖం ఆనందంగా వెలిగింది కాని వుత్తరంచదువుతున్న ముఖం బీభత్సంగామారిపోతోంది.

శారదా!

. నీ హృదయ పీఠంపైన ఎంతో ఉన్నత స్థానంలో వుండే నేను పూర్తిగా దిగజారిపోయి వుంటాను యీపాటికి. కాని దయవుంచి యిది పూర్తిగా చదివిన న్నికనైనా మరిచిపో. ఆ రాత్రి నీ ఆజ్ఞానుసారము నీ యింట్లో నీకొరకు నిరీక్షిస్తూనే నిద్రపోయాను. నిజంగా కొన్ని సంవత్సరముల తరువాత ఎంతో హాయిగా నిద్రపోయా నా రాత్రి. కారణం నాకే తెలియదు. నా సుఖంకోసం నీవు పెట్టిన ఫానుగాలికి గాబోలు బహుశః అంత నిద్ర. మూడవబోయే ముందు లేచాను. నీ గదిలో లైటు చూచి మేల్కొని

వున్నావని వచ్చాను. ఆత్మసాక్షిగా ఆ రాత్రి జరిగినది యింతే. అంతకు మించి యే నీచపుకోరికా, నాలో ప్రవేశించలేదు. అంత నిగ్రహం లేనివాడను కాను, అని ఆ రాత్రి తన అనుభవం తెలియచేశాడు.


ఆ రోజు పిరికి పందలాగా నీతో చెప్పకుండా వచ్చేశాను. అందుకు నాకూ బాధగానే వుంది. కాని అది మన కలవాటే గదూ! నేను వెళ్ళిపోతుంటే నీకు కోపం వస్తుంది. ఆ రోజు గుర్తుందా శారదా! నామీద కోపంతో స్టేషన్‌కి రానన్నావు. అదే మనం దూరం అవటానికి నాంది.

ఇంత కాలానికి కలసిన నన్ను నా చరిత్రేమీ అడగలేదు నీవు. నేనుమాత్రం నీద్వారా, అప్పన్న ద్వారా అన్ని సంగతులూ తెలుసుకున్నాను. నా చరిత్రగూడా విను విసుక్కోక. వాల్తేరు నుండి వెళ్ళాక కొంతవరకు నీకు తెలుసు. సుశీలతో వివాహం అయాక త్వరలోనే యిక్కడ వుద్యోగం దొరికింది. నా సంతోషాన్ని నాశనం చేసిందనే భావనతో సుశీల యెవరో తెలియనట్లే కొంత కాలం గడిపాను. శలవులొస్తే యాత్రలనే మిషతో బాధను వెళ్ళబోసుకోవాలని ప్రశాంత ప్రదేశాలు వెతుక్కుంటూ వెళ్ళిపోయేవాడిని, యింట్లో వుండబుద్ధిగాక. ఒకానొక సంఘటనవల్ల అది తప్పని తెలుసుకున్నాను. నా అసమర్థత వల్ల నిన్ను దూరం చేసుకున్నాను. ఇప్పుడు అగ్నిసాక్షిగా వివాహమాడి, ఈమెకు అన్యాయం చేస్తున్నానని తెలుసుకున్నాను. రెండు సంవత్సరాల తరువాత సుశీలతో జీవితం ప్రారంభించాను యాంత్రికంగా. కాని నా మానసిక బాధకు తోడైనదే గృహ వాతావరణం. నా భార్యకు నేను తృణప్రాయం. ఎంతసేపూ నా గత చరిత్రలోని లోపాలు వెతకటమే ఆమె ధ్యేయం. విపరీతమైన అనుమానాలు. ఆవిడ తప్పులేదు. మమ్మల్ని మొదటినుండీ చులకనభావనతో చూచే కుటుంబములోని వ్యక్తి ఆమె. ఆమెకు అమ్ముడయిన నేను యిదంతా సహించవలసినదేగద!

ఒకసారి నీగురించి ధైర్యం చేసి భాస్కర్‌కు వ్రాశాను. ప్రస్తుతం వివాహము చేసుకోనన్నావనీ, మెడిసిన్ చదువుతున్నావనీ, నీ పట్టుదలకు మీ నాన్నాగారు వ్యధచెందుతున్నారనీ, ఇందుకు కారణం నేనే ననీ కోపంతో వ్రాశాడు. ఆరోజు ఆడవాళ్ళకన్న అధమంగా యెంత కుమిలి యేడిచానో చెపితే నీవు నమ్మతావా శారదా! ఒకసారి నీ దగ్గిరికి రావాలని వుండేది కాని యెలా రాను? రాలేకపోయాను. తర్వాత ఎన్ని వుత్తరాలో వ్రాశాను భాస్కరుకు. జవాబు రాలేదు. అమెరికాలో భార్యతో సహా వున్నాడని యీమధ్యనే తెలిసింది.

సరిగా యిప్పటికి దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం సుశీలకు చక్కని పాపాయి కలిగింది. సుశీలకు చాల

జబ్బు చేసి ప్రాణాపాయంనుండి బైట పడింది. కాని, నాకు సంతోషాన్నివ్వగల పాప — దక్కలేదు నాకర్మ. సుశీల బల హీనతను గురించి చెప్పింది డాక్టరు. ఆమెకు యెప్పుడు కాన్పు వచ్చినా ప్రమాదం దాటాలన్నది. ఇదొక పరీక్ష అనుకున్నాను. వెంటనే ఎవరికీ తెలియ



కుండా ఆపరేషన్ చేయించుకున్నాను. నీముందు నాకు రహస్యం లేదు. అందుకే నీకు సర్వం తెలియచేస్తున్నాను. ధైర్యంగా విను. ఇప్పుడు సుశీల గర్భవతి అని తెలుసుకున్న నా పరిస్థితి యేమిటి? అనుభవజ్ఞులైన డాక్టర్లను కలుసుకొన్నాను. నాలో మార్పేమీ జరుగలేదని తెలిసింది. అంతవరకు సుశీల స్వార్థపు ఉయ్యాలలో వూగే మూర్ఖురాలు మాత్రమే అనుకున్నాను. కాని, మానవత్వపు విలువను మసిచేసే మందబుద్ధి అనుకోలేదు. ఆమెను అడిగాను. ఆమెకు సర్వం చెప్పాను. మొదలు విస్తుబోయింది కాని ఒప్పుకుంది. తన ప్రేమేయం లేదనీ, ఒక దుస్సంఘటన ఫలితమనీ ఏడుస్తూ పశ్చాత్తాపం పడుతున్నది. ఇంక నే నేమి చేయాలి? నాకు చక్కని శిక్ష విధించాడు భగవంతుడు. రాజు పెల్లిగ్రాం చూచి ఓసారి సుశీలను చూచిరావటం నా కనీస ధర్మమని వచ్చిన నాకు, జీవితంలో ఒక్కసారి నిన్ను చూడాలనే కోరిక తీరింది.

త్వరలో సుశీల తన కొడుకుతో వస్తుంది. నేను భరించలేను. నా కంత శక్తి లేదు. నా కర్తవ్యం నిర్ణయించుకున్నాను. ఈ నాటక రంగంనుండి నిష్క్రమిస్తున్నాను. దీనివల్ల యెవరికి బాధలేదు. నా తలిదండ్రులు గతించారు. సుశీలకు తండ్రి గతించినా మిగిలిన వారంతా, వున్నారు, ఆస్తి వుంది. నాగురించిన బాధ యేనాడూ లేదామెకు. నిశ్చింతగా, సంతోషంగా వెళ్ళిపోతున్నాను. సాధ్యమైనంత వరకు బలవన్మరణము లాటి నీచకార్యం చేయను. గతం లేని కొత్త స్థానంకోసం అన్వేషిస్తాను. ఇది నీకు చేరుసరికి ఎక్కడ వుంటానో! ఈ విషయం యీరోజే సుశీలకు తెలియజేస్తున్నాను.

శారదా! నిన్ను ప్రత్యక్షంగా శెలవు కోరలేక పరోక్షంగా కోరుతున్నాను. నాకు శెలవిస్తావుకదూ! మనసు మూగదైనా, మమత మూగది కాదని, భౌతిక ప్రేమజీవితముకన్న అంతఃకరణశుద్ధమైన ప్రేమ గొప్పదని చూపిన నీవు, నా కంకితం చేసిన నిర్మలప్రేమజీవితాన్ని నాలో పవిత్రంగా దాచుకుని వెళ్ళిపోతున్నాను. శెలవు శారదా!—ఆనంద్."

పుణ్య గౌతమీతీరాన ఒకవూరి వెలుపల పెద్దతోట, ఆ తోటమధ్యలో ఒక చిన్న కుటీరం. తోటలో ప్రత్యూష పవనానికి సంతోషంగా నాట్యంచేసే గులాబి బాలల మధ్య కర్మసాక్షి కభిముఖంగా కూర్చుని గీతాపారాయణం చేస్తూ వుంటుంది, కాషాయాంబరధారిణి శారద ఎల్లవేళలా. ఆమె నీడనుగూడా కాపాడుతూ తిరిగే భృత్యుడు అప్పన్న, సమీపంలో కూర్చుని వింటూ వుంటాడు. అతి ప్రసన్నమైన ఆమె దృష్టిలో ఏదో నిరీక్షణ సుస్పష్టంగా గోచరిస్తూంటుంది. ఎందుకో! ఎవరికోరకో ఆ నిరీక్షణ!